



EVENING EDITION

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

4 PM
www.suryaa.com
బుధవారం
09-07-2025
పేజీలు: 02




## డ్రగ్స్ కేసు.. జైలు నుంచి విడుదలైన హీరో

మాదకద్రవ్యాల కేసులో నటులు శ్రీరామ్ శ్రీకాంత్, కృష్ణలకు నిబంధనలతో కూడిన బెయిలు మంజూరైంది. మాదక ద్ర వ్యాల వినియోగం కేసులో గత నెలలో అరెస్టయి జైలులో ఉన్న శ్రీకాంత్, కృష్ణ తమకు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లు సోమవారం న్యాయమూర్తి నిర్మల్ కుమార్ విచారించారు.ఈ కేసులో మొదటి నిందితుడు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా నటుడు శ్రీకాంత్ను అరెస్ట్ చేశారని, అరెస్ట్ చేసిన సమయంలో శ్రీకాంత్ వద్ద ఎలాంటి మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకోలేదని శ్రీకాంత్ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. కృష్ణకు నిర్వహించిన వైద్య పరీక్షల్లో మాదకద్రవ్యాలు వినియో గించినట్లు నిరూపణ కాలేదని కృష్ణ తరఫు న్యాయవాది వివరించారు. అయితే.. ఈ కేసులో ఇప్పటికే అరెస్ట్ చేసిన AIADMK మాజీ నేత నిందితుల వాంగ్మూలం ఆధారంగా శ్రీకాంత్, కృష్ణలను అరెస్ట్ చేసినట్లు, వారికి బెయిలు మంజూరు చేయరాదని పోలీసుల తరఫు న్యాయవాది కోరారు.




## జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిండెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ విదేశాల్లో చల్లదనం కోసం పోతున్నారు అని అన్నారు.నెలలో 20 రోజులు విదేశాల్లో కేటీఆర్‌కి ఏం పని అని ప్రశ్నించారు. కేసీఆర్ కోటాలో కేటీఆర్ డైరెక్ట్ ఎమ్మెల్యే అయిపోయాడు అని, రాజకీయ ఒడిదుడుకులు ఆయనకేం తెలుసు? అని మండిపడ్డారు. తాము ఎన్నో వ్యవప్రయాసలతో రాజకీయ నేతలం అయ్యాం అని చెప్పారు. తమకున్న అనుభవాల ముందు కేటీఆర్ జీరో అని జగ్గారెడ్డి విమర్శించారుగాంధీ భవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. 'కేటీఆర్ ఈ మధ్య తెలంగాణలో ఉండటం లేదు. నెలకోసారి విదేశాలకు వెళుతున్నాడు. నెలలో పది రోజులు ఇక్కడ, 20 రోజులు విదేశాల్లో ఉంటాడు. కాబట్టి సీఎం రేవంత్ రెడ్డీ షెడ్యూల్ ఆయనకు తెలియదు. విదేశాల్లో తిరిగే కేటీఆర్‌కి సీఎం రేవంత్ ఏం చేస్తున్నది ఎందుకు తెలుస్తుంది. పదేళ్లు మంత్రిగా నువ్వు, సీఎంగా మీ నాయన చేశాడు. ఢిల్లీకి ఎందుకు పోతారో ఆ మాత్రం తెలియదా? కేటీఆర్. ఎరువులు, నిధులు, నీళ్ల పంచాయతీ కోసం సీఎం రేవంత్ ఢిల్లీ వెళ్లారు. కేసీఆర్ కుటుంబం ఢిల్లీకి లిక్కర్ దందా కోసం పోయింది. హరీష్ రావు, కేటీఆర్‌లు ఈడీ ఆఫీస్ల కోసం ఢిల్లీ వెళ్ళారు. మా సీఎం కేంద్రం చుట్టు తిరుగుతున్నారు. కేటీఆర్‌కి సిస్టర్ స్ట్రోక్ తగిలింది. కాంగ్రెస్ పార్టీకి పుట్టినిల్లు డిల్లీ. మీ లాగా మాది గల్లి పార్టీ కాదు కదా?. కేటీఆర్.. నీ స్ట్రోక్‌ల లొల్లి మాకెందుకు రుద్దుతున్నావు' అని అడిగారు. 'కేసీఆర్ కోటాలో కేటీఆర్ డైరెక్ట్ ఎమ్మెల్యే అయిపోయాడు. రాజకీయ ఒడిదుడుకులు నీకేం తెలుసు?. సన్నాసులు అనే మాటలు స్టార్ట్ చేసింది మీ అయ్యనే. మీరు తిట్టిన మాటలను కాస్త పాలిష్ చేసి తిడుతున్నారు. మేము సత్రం నడపడం లేదు, మీరు తిడితే మేము తిడతం. సీఎం రేవంత్ రెడ్డిని గోకుడు ఎందుకు, తన్నించుకోవడం ఎందుకు?. తిట్ల పురాణం మీదే.. మీరు ఒకటి అంటే మేం పది తిడుతున్నాం.



## కుప్పకూలిన వంతెన.. నదిలో పడిపోయిన వాహనాలు

గుజరాత్‌లో విషాద సంఘటన చోటుచేసుకుంది. వడోదర జిల్లాలోని మహిసాగర్ నదిపై ఉన్న 45 ఏళ్ల గంభీర వంతెన కూలిపోయింది. బుధవారం (జూలై 9) ఉదయం 7.30 గంటల సమయంలో వంతెనలోని ఒక భాగం కుప్పకూలడంతో పలు వాహనాలు నదిలో పడిపోయాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని పద్రా పోలీసు ఇన్‌స్పెక్టర్ విజయ్ చరణ్ తెలిపారు. ప్రమాదానికి గురైన వాహనాల్లో రెండు ట్రక్కులు, రెండు వ్యాన్లు ఉన్నాయి. సమాచారం అందుకున్న రెస్క్యూ టీమ్స్ సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ఇప్పటివరకు దాదాపు 10 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చి చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. నదిలో చిక్కుకున్న మరికొంత మంది కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. పద్రాను ఆనంద్ జిల్లాకు అనుసంధానించిన ఈ వంతెన చాలా కాలంగా శిథిలావస్థలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఒవైసీ ఫాతిమా కాలేజీపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్లారిటీ



పాతబస్తీలోని సూరం చెరువులోని ఎఫ్‌టీఎల్‌లో ఫాతిమా కాలేజీని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నిర్మించారు. అయితే ఈ కాలేజీని ఎందుకు కూల్చడం లేదని ప్రతిపక్షాలు హైడ్రా అధికారులని ప్రశ్నిస్తున్నారు. సామాన్యులకు ఒక న్యాయం, ఒవైసీకి ఒక న్యాయమా అంటూ నిలదీస్తున్నారు. ఈ క్రమంలో ఫాతిమా కాలేజీ గురించి హైడ్రా కమిషనర్ ఏవీ రంగానాథ్ స్పందించారు. ఈ కాలేజీని ఎందుకు కూల్చి వేయడం లేదనే దానిపై క్లారిటీ ఇచ్చారు ఏవీ రంగానాథ్. ఒవైసీ కాలేజీని ఎందుకు కూల్చివేయడం లేదని ఇప్పుడు అందరూ తమని అడుగుతున్నారని ఏవీ రంగానాథ్ అన్నారు. ఈ కాలేజీ ఎఫ్‌టీఎల్‌లో నిర్మించినందున గత ఏడాది సెప్టెంబర్‌లో తొలగించే ప్రయత్నం చేస్తామని చెప్పామని గుర్తుచేశారు. కానీ పేద ముస్లిం మహిళల కోసం కేజీ నుంచి పీజీ వరకు ఈ కాలేజీ నడుస్తోందని చెప్పకొచ్చారు. అలాగే ఈ కాలేజీలో ఎలాంటి ఫీజులు వసూలు చేయడం లేదని స్పష్టం చేశారు. ఈ కాలేజీలో 10,000 మందికి పైగా బాలికల నుంచి యువతుల వరకు విద్యను అభ్యసిస్తున్నారని గుర్తుచేశారు. పేద ముస్లిం మహిళలను వెనుక బాటుతనం నుంచి ఒవైసీ కాలేజీ విముక్తి కల్పిస్తోందని అన్నారు. పేదల కోసం పనిచేస్తున్న కాలేజీ కావడంతోనే దానిపై చర్యలు తీసుకోవడానికి ఆలోచిస్తున్నామని చెప్పకొచ్చారు. ఎంఐఎం నాయకుల ఆస్తుల వ్యవహారంలో కలినంగానే వ్యవహరిస్తున్నామని స్పష్టం చేశారు ఏవీ రంగానాథ్. ఎంఐఎం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కబ్జా చేసిన భారీ నిర్మాణాలను కూల్చివేశామని ఏవీ రంగానాథ్ తేల్చిచెప్పారు. 25 ఎకరాల సరస్సును ఫ్లాట్‌గా మార్చిన ఒవైసీ కుటుంబానికి చెందిన సన్నిహితుడు కట్టడాలను కూడా కూల్చివేశామని గుర్తుచేశారు.



## నిండు కుండలా బతుకమ్మ కుంట

హైదరాబాద్ జిల్లా అంబర్‌పేట మండలం బాగ్ అంబర్‌పేట్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 563లో 14.06 ఎకరాల్లో బతుకమ్మ కుంట ఉన్నట్లుగా 1962-63 నాటి రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. రానురాను చెరువు కబ్జాకు గురై.. 5.15 ఎకరాలే మిగిలాయి. బతుకమ్మ కుంటను బతికించాలంటూ మాజీ ఎంపీ వీహెచ్ కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తూవస్తున్నారు. ఈ మేరకు జీహెచ్ఎంసీకి, మంత్రులకు ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశారు. హైడ్రా ఏర్పాటయ్యాక కమిషనర్ రంగనాథ్‌ను కలిసి బతుకమ్మ కుంటను పునరుద్ధరించాలని కోరారు. రంగనాథ్, బతుకమ్మ కుంటను సందర్శించి, దానిని సుందరీకరించాలని నిర్ణయించారు. కుంట తాలూకు స్థలం తనదేనంటూ ఓ వ్యక్తి హైకోర్టును ఆశ్రయించి స్టే ఆర్డర్ పొందారు. హైడ్రా, రెవెన్యూ, ఇరిగేషన్, సంబంధిత శాఖల అధికారులు సర్వే నంబర్ 563లోని రికార్డులను పరిశీలించి కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు.



## రూ.75 లక్షల మోసం.. ఆలియా మాజీ అసిస్టెంట్ అరెస్ట్


బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ మాజీ అసిస్టెంట్ వేదికా శెట్టిని ముంబై పోలీసులు అరెస్టు చేశారు. వేదికా శెట్టి అలియా భట్ ప్రొడక్షన్ హౌస్ నుండి 76 లక్షల రూపాయలు మోసం చేశారని ఆరోపణలు ఉన్నాయి. మే 2022 నుండి ఆగస్టు 2024 వరకు నకిలీ బిల్లులతో మోసం చేసినట్లు సమాచారం. నకిలీ బిల్లులను సృష్టించి, వాటిపై ఆలియా సంతకం తీసుకుని, ఆ తర్వాత మొత్తం డబ్బును వేదిక తన స్నేహితురాలి ఖాతాకు బదిలీ చేసేది. ఈ విధంగా, రెండేళ్లలో దాదాపు 76 లక్షల రూపాయలు మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. డబ్బులను దుర్వినియోగం చేసినట్లు ఆరోపిస్తూ ఆలియా తల్లి సోని రజ్దాన్.. జనవరిలో వేదికపై జుహు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఆరోపణల నేపథ్యంలో గత 5 నెలలుగా వేదిక పరారీలో ఉంది. ఎట్టకేలకు బెంగళూరులో వేదికను అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో హాజరుపర్చి.. జూలై 10 వరకు ఆమెను కస్టడీకి తీసుకున్నారు.

## బీజేపీ డబుల్ ఇంజిన్ మోడల్ మరోసారి బట్టబయలు



గుజరాత్‌లో కుప్పకూలిన వంతెన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. గుజరాత్‌లోని మహిసాగర్ నదిపై నిర్మించిన గంభీర వంతెన కూలడంతో.. బీజేపీ డబుల్ ఇంజిన్ మోడల్ మరోసారి బట్టబయలు అయిందని కేటీఆర్ పేర్కొన్నారు.మోర్బీ వంతెన కూలి 140 మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన విషాదం మరువకముందే, డబుల్ ఇంజన్ బీజేపీ సర్కార్ ఉన్న గుజరాత్‌లో మరో వంతెన నదిలో కూలిపోయింది. గుజరాత్‌లో, డబుల్ ఇంజిన్ ఉన్న బీహార్, మధ్యప్రదేశ్‌లలో వంతెనలు వరుసగా ఎందుకు కూలుతున్నాయి? వీటిపై ఎన్‌డీఎస్ఏ లేదా ఇతర భద్రతా సంస్థలు విచారణ జరుపుతాయా? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఇదేనా మీరు గొప్పలు చెప్పకునే గుజరాత్ 'మోడల్'? ప్రజల ప్రాణాలు తీసే నిర్లక్ష్యంపై బీజేపీ సమాధానం చెప్పాలి! అని డిమాండ్ చేశారు. గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని కేటీఆర్ ఆకాంక్షించారు.

## లక్ష్మీ రాయ్ బికినీ వేస్తే ఆ కిక్కే వేరబ్బా



హీరోయిన్ లక్ష్మీ రాయ్..ఈ పేరు తెలియని సినిమా అభిమాని ఉండరంటే అతిశేయోక్తి కాదు. చేసింది తక్కువ సినిమాలే అయినప్పటికీ, మంచి గుర్తింపు దక్కించుకుంది. తన అందం, అభినయంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది ఈ హాట్ బ్యూటీ. కర్ణాటకలో జన్మించిన ఈ భామ తమిళం, మలయాళం, కన్నడ భాషలలోనూ అనేక చిత్రాల్లో నటించింది. తెలుగులో ముఖ్యంగా ఐటెం సాంగ్స్‌తో మంచి గుర్తింపు తెచ్చుకుంది.కాంచనమాల కేబుల్ టీవి అనే సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచియం అయింది.సర్దార్ గబ్బర్ సింగ్, ఖైదీ నెం 150 సినిమాలతో మెగా హీరోల సినిమాల్లో ఐటెం సాంగ్స్‌తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యింది.ప్రస్తుతం లక్ష్మీ రాయ్ తెలుగు, తమిళం, హిందీ భాషలలో అనేక చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. త్వరలోనే ఈమె నటించిన కొన్ని కొత్త చిత్రాలు విడుదల కానున్నాయి. హీరోయిన్‌గా, ఐటెం సాంగ్స్‌లో, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా అనేక రకాల పాత్రలు చేసి తన ప్రతిభను చాటుకుంది. తన అందంతో ప్రేక్షకులను అలరిస్తూ, అనేక ఫ్యాషన్

## బ్రిక్స్ కూటమికి డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరిక

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్ సభ్యదేశంగా ఉన్న బ్రిక్స్ కూటమిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బ్రిక్స్ దేశాలు అమెరికా డాలర్‌ను బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపిస్తూ, ఆ కూటమిలోని దేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 10 శాతం అదనపు సుంకం విధిస్తామని గట్టిగా హెచ్చరించారు. సోమవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "బ్రిక్స్ కూటమి మమ్మల్ని దెబ్బ తీయడానికే ఏర్పడింది. మా డాలర్ విలువను తగ్గించేందుకు వారు పనిచేస్తున్నారు. అందుకే వారు కచ్చితంగా 10 శాతం సుంకం చెల్లించాల్సి ఉంటుంది. డాలరే రాజు. దానిని అలాగే ఉంచుతాం. ఎవరైనా సవాలు చేయాలనుకుంటే చేయొచ్చు. కానీ దాని కోసం వారు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది" అని ట్రంప్ హెచ్చరిక చేశారు.భారత్‌తో వాణిజ్య ఒప్పందం చర్చలు తుది దశలో ఉన్నప్పటికీ, బ్రిక్స్ సభ్యదేశంగా ఉన్నందున భారత్‌కు ఎలాంటి మినహాయింపులు ఉండవని ట్రంప్ తేల్చిచెప్పారు. ఆగస్టు 1 నుంచి ఈ కొత్త టారిఫ్‌లు అమల్లోకి వస్తాయని, ఈ గడువు విషయంలో ఎలాంటి మార్పు ఉండదని ఆయన ప్రకటించారు. అయితే, ఇతర దేశాలు సరైన ప్రతిపాదనలతో సంప్రదింపులకు వస్తే చర్చలకు సిద్ధంగా ఉన్నామన్నారు. గడువుపై కట్టుబడి ఉన్నప్పటికీ చర్చలకు అవకాశం ఉందని పరోక్షంగా సూచించారు.బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాతో పాటు మొత్తం 11 దేశాలు బ్రిక్స్ కూటమిలో ఉన్నాయి. ప్రపంచ జీడీపీలో 40 శాతం వాటా, ప్రపంచ జనాభాలో దాదాపు సగం ఈ దేశాల్లోనే ఉంది. గత అధ్యక్షులు సరిగ్గా వ్యవహరించకపోవడం వల్లే అమెరికా నష్టపోయిందని, తన హయాంలో ఆ పరిస్థితిని పునరావృతం కానివ్వనని ట్రంప్ వ్యాఖ్యానించారు.

## ఢిల్లీలో నేను ఉండలేను.. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



దేశంలో అత్యంత కాలుష్య నగరాల్లో దేశరాజధాని ఢిల్లీ మొదటి స్థానంలో ఉంటుంది. అక్కడ ఏటా కాలుష్య స్థాయిలు ప్రమాదకరస్థాయిలో ఉంటాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలో వాయు కాలుష్యంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన వ్యక్తం చేశారు. తాను రాజధాని నగరంలో రెండు లేదా మూడు రోజులకంటే ఎక్కువ ఉండలేనని అన్నారు. ఢిల్లీకి వస్తే.. ఎప్పుడెప్పుడు వెళ్లిపోదామా అనే ఉంటుందని వ్యాఖ్యానించారు. 'ఏక్ పెడ్ మా కే నామ్ 2.0' పేరుతో నిర్వహించిన మొక్కల పెంపకం కార్యక్రమంలో పాల్గొన్న నితిన్ గడ్కరీ ఈ సందర్భంగా మాట్లాడారు. 'నేను ఢిల్లీలో రెండు లేదా మూడు రోజులు మాత్రమే ఉండగలను. అంతకుమించి ఉండటం నావల్ల కాదు. ఢిల్లీలో అడుగుపెట్టగానే ఎప్పుడు వెళ్లిపోదామా అనే ఉంటుంది. అందుకే నేను వచ్చేటప్పుడే రిటర్న్ టికెట్స్ కూడా బుక్ చేసుకుంటాను. ప్రజలు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాలి. ఢిల్లీలో కాలుష్యం కారణంగా సాధారణ ప్రజల ఆయుర్దాయం తగ్గింది. వాహనాలకు వినియోగించే శిలాజ ఇంధనాల వల్ల కలిగే కాలుష్యాన్ని తగ్గించడం ప్రజలందరి ప్రధాన బాధ్యత' అని అన్నారు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM




## 6 బంతుల్లో 6 వికెట్లతో కొత్త చరిత్ర

క్రికెట్ చరిత్రలో అద్భుతాలు, అసాధారణ రికార్డులు ఎప్పుడూ అభిమానులను ఆశ్చర్యపరుస్తుంటాయి. ఇటీవల ఇంగ్లాండ్ టీ20 టోర్నమెంట్‌లో లంకాషైర్ జట్టు బౌలర్లు అలాంటి ఓ అద్భుతాన్ని సృష్టించారు. కేవలం 6 బంతుల్లో 6 వికెట్లు పడగొట్టి చరిత్ర సృష్టించారు. క్రికెట్ ప్రపంచంలో అరుదైన రికార్డును తమ ఖాతాలో వేసుకున్నారు.జులై 4న నార్తాంప్టన్‌షైర్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో లంకాషైర్ అద్భుతమైన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో లంకాషైర్ బౌలర్లు నిప్పులు చెరిగారు. ముఖ్యంగా, మహమూద్ అద్భుతమైన బౌలింగ్‌తో నాలుగు వరుస వికెట్లు పడగొట్టాడు. ఇందులో ఒక హ్యాట్రిక్ కూడా ఉంది. దీంతో ప్రత్యర్థి జట్టు పూర్తిగా కకావికలం అయ్యింది. అయితే, ఈ అద్భుత ప్రదర్శన అక్కడితో ఆగలేదు. మరుసటి రోజు, అంటే జూలై 5న లంకాషైర్ జట్టు డెర్బీషైర్‌తో తలపడింది. ఈ మ్యాచ్‌లో లంకాషైర్ బౌలర్లు మరింత దూకుడుగా బౌలింగ్ చేశారు. మ్యాచ్ ప్రారంభంలోనే మార్క్ వుడ్ రెండు కీలక వికెట్లు తీశాడు. ఈ రెండు వికెట్లు, అంతకుముందు నార్తాంప్టన్‌షైర్‌తో జరిగిన మ్యాచ్‌లో మహమూద్ తీసిన చివరి నాలుగు వరుస వికెట్లతో కలిపి, లంకాషైర్ బౌలర్లు వరుసగా ఆరు బంతుల్లో ఆరు వికెట్లు పడగొట్టిన అసాధారణ ఘనతను సాధించారు.

## హైదరాబాద్ లో కల్తీ కల్లు కలకలం.. 15 మందికి అస్వస్థత

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో కల్తీ కల్లు సేవించిన పలువురు తీవ్ర అస్వస్థతకు గురై కూకట్‌పల్లి రాందేవ్ ఆసుపత్రిలో చేరారు. రాందేవ్ ఆసుపత్రి చుట్టూరా అంబులెన్స్‌ల సైరన్లతో మార్మోగాయి. కల్తీ కల్లు సేవించిన 15 మంది ఆసుపత్రిలో చేరారు. వైద్యం అందించిన డాక్టర్లు 24 గంటలు గడిస్తే గాని వారి పరిస్థితి చెప్పలేమని తెలిపారు. పలువురు బాధితులు వెంటిలేటర్స్‌పై చికిత్స పొందుతున్నారు. సాయంత్రం ఐదు గంటల నుండి జరిగిన ఘటన తెలిసిన స్థానిక ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరెకపూడి గాంధీలు బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సిబ్బందికి తెలిపారు. విషయం తెలుసుకున్న డిఎంహెచ్ఓ ఉమా గౌరీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్తీ కల్లు సేవించడంతో 15 మంది అస్వస్థతకు గురయ్యారని కల్లు కాంపౌండ్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హృదయవిదారకంగా మారిన సంఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.





## ఆ ఉద్యోగుల అకౌంట్లోకి మూడు నెలల జీతం

తెలంగాణలోని గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు శుభవార్త చెప్పింది. మూడు నెలలుగా ఎదురుచూస్తున్న తమ జీతాలను విడుదల చేసింది. ఏప్రిల్, మే, జూన్ మాసాలకు సంబంధించిన మొత్తం రూ.150 కోట్లను ఆర్థిక శాఖ విడుదల చేయడంతో, ఈ నిధులు నేడు గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ కానున్నాయి. ఒకటి, రెండు రోజుల్లో ఈ జీతాలు MPWలకు అందే అవకాశం ఉంది. ఈ ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 53 వేల మందికి పైగా మల్టీ పర్పస్ వర్కర్లకు పెద్ద ఊరట లభించినట్లైంది. గ్రామ పంచాయతీ కార్మికులు, ముఖ్యంగా మల్టీ పర్పస్ వర్కర్లు గ్రామాల్లో పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, మంచినీటి సరఫరా, పచ్చదనం పెంపుదల వంటి కీలక పనులను నిర్వర్తిస్తుంటారు. సమాజానికి నిస్వార్థ సేవలు అందిస్తున్నప్పటికీ.. వారికి సకాలంలో జీతాలు అందకపోవడం తీవ్ర ఆవేదనకు గురిచేసే అంశం. గత మూడు నెలలుగా జీతాలు అందకపోవడంతో, ఈ కార్మికులు, వారి కుటుంబాలు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాయి. చాలామంది కార్మికులు రోజువారీ కూలీలపై ఆధారపడి జీవిస్తుంటారు. జీతాలు ఆలస్యం కావడంతో బియ్యం, పప్పులు, కూరగాయలు వంటి నిత్యావసరాలు కొనుగోలు చేయడానికి కూడా కష్టపడ్డారు. కుటుంబ పోషణకు అవసరమైన కనీస వనరులు లేక అల్లాడిపోయారు. పట్టణాలు, నగరాల శివార్లలో నివసించే కార్మికులకు ఇంటి అద్దెలు, విద్యుత్ బిల్లులు పెద్ద భారంగా మారాయి. కొందరు అప్పులు చేసి ఇవి చెల్లించాల్సి వచ్చింది. వాహనాల లోన్లు, ఇతర వ్యక్తిగత అప్పులకు EMIలు కట్టలేక వాయిదాలు పడిన వారూ ఉన్నారు.

# మహిళలకు ఫ్రీ బస్సు జిల్లాకే పరిమితం

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం మహిళామణులకు శుభవార్త చెప్పింది. రాష్ట్రంలోని ఆడపడుచులు ఎప్పుడెప్పుడా అని ఆశగా ఎదురుచూస్తున్న సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీ జర్నీపై స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే మరో అప్ డేట్ ఇచ్చారు.ఆడవాళ్లు ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీగా ప్రయాణించేందుకు ముహూర్తం ఖరారు చేసిన విషయం తెలిసిందే.తాజాగా దానిపై మరో స్పష్టత ఇచ్చారు సీఎం చంద్రబాబునాయుడు. శ్రీశైలం జిల్లా పర్యటనలో ఈ పథకాన్ని ఆగస్టు 15వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు.అయితే ఈ ఉచిత ప్రయాణ సౌకర్యానికి సంబంధించి ముఖ్యమంత్రి చిన్న పేచి పెట్టారు. మహిళలకు ఫ్రీ టికెట్ జర్నీ కేవలం జిల్లా పరిధికి మాత్రమే వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఏ జిల్లాకు చెందిన మహిళలు ఆ జిల్లాలో మాత్రమే ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉంటుందని తెలిపారు.శ్రీశైలం పర్యటనలో భాగంగా సున్నిపెంటలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు ఈ విషయంపై స్పష్టత ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను కచ్చితంగా అమలు చేస్తామని మరోసారి ప్రకటించారు. సంక్షేమం, అభివృద్ధి తమ ప్రభుత్వానికి రెండు కళ్ల లాంటివని పేర్కొన్నారు. తమ ప్రభుత్వానికి, గత ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలు గమనించాలని కోరారు.అయితే ఇప్పటి వరకు ఏపీలోని మహిళలంతా ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రం మొత్తం ఉచితంగా తిరగవచ్చని భావించారు. తెలంగాణలో అమలవుతున్న మహాలక్ష్మి ఫథకం తరహాలోనే ఏపీలో కూడా అమలు చేస్తారని భావించారు. కాని చంద్రబాబు కేవలం ఏ జిల్లాలో ఉన్న వాళ్లకు ఆ జిల్లాకే పరిమితం అని చెప్పడంపై ఒకింత నైరాశ్యానికి గురవుతున్నారు.ఇప్పటికే కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో చాలా పథకాల్లో కోత పెడుతున్నారని వాపోతున్నారు ఏపీ ప్రజలు. వైసీపీ ఇచ్చిన అమ్మఒడి డబ్బులు ఏడాది ఆలస్యంగా తల్లికి వందనం పేరుతో ఇచ్చారని పెదవి విరుస్తున్నారు. అదే విధంగా ఫించన్ విషయంలో కూడా కొందరి పేర్లు తొలగించారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఇలాంటి సమయంలో చంద్రబాబు ఉచిత బస్సు ప్రయాణంపై ప్రకటన చేసినందుకు సంతోషించాలో .. కేవలం ఏ జిల్లా వాళ్లు ఆ జిల్లాలో మాత్రమే తిరగాలనే కండీషన్ పెట్టినందుకు చింతించాలో అర్థం కావడం లేదని కొందరు మహిళలు వాపోతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒకేలా అమలవుతుందనుకున్న ఈ పథకం తెలంగాణలో పూర్తిగా ..ఆంధ్రాలో అసంపూర్తిగా అమలవుతుందనే విమర్శలు వస్తున్నాయి.పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు ఒక పెద్ద వరమని, రాయలసీమ అభివృద్ధికి తన వద్ద స్పష్టమైన బ్లూ ప్రింట్ ఉందని చంద్రబాబు అన్నారు. గోదావరి నీటిని బనకచర్లకు తరలిస్తే రాయలసీమలో కరువు ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు.





## మర్డర్ కేసు.. నిమిషా ప్రియకు 16వ తేదీన ఉరి

ఓ మర్డర్ కేసులో కేరళకు చెందిన నిమిషా ప్రియ అనే నర్సుకు యెమెన్ ప్రభుత్వం మరణ శిక్ష విధించిన సంగతి తెలిసిందే. నిమిషా ప్రియ ఉరికి సంబంధించి తేదీ ఖరారు అయింది. ఆమెను జులై 16వ తేదీన యెమెన్ ప్రభుత్వం ఉరి తీయనుంది. ఈ విషయం తెలిసి కేరళలోని ఆమె కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఇక, నిమిషా ఉరికి సంబంధించి భారత విదేశీ వ్యవహారాల శాఖ యెమెన్ ప్రభుత్వంతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఎప్పటికప్పుడు అక్కడి పరిస్థితులు సమీక్షిస్తున్నట్లు సమాచారం. కేరళకు చెందిన నిమిషా ప్రియ నర్సింగ్ పూర్తి చేసింది. 2008లో నర్సుగా పని చేయడానికి యెమెన్ దేశానికి వెళ్లింది. కొన్నేళ్ళ పాటు పలు ఆస్పత్రుల్లో పని చేసిన తర్వాత సొంతంగా ఓ క్లినిక్ పెట్టుకుంది. ఈ నేపథ్యంలోనే 2014లో ఆమెకు తలాల్ అబ్దో మహది అనే వ్యక్తితో పరిచయం అయింది. యెమెన్ రూల్స్ ప్రకారం .. ఇతర దేశాల వాళ్లు ఆ దేశంలో బిజినెస్ చేయాలంటే.. స్థానికులను భాగస్వామిగా చేర్చుకోవాలి. అందుకే నిమిషా తన క్లినిక్ బిజినెస్‌లో భాగస్వామిగా తలాల్ అబ్దోను చేర్చుకుంది. అయితే, క్లినిక్ ఓపెన్ చేసిన కొంతకాలానే ఇద్దరి మధ్యా గొడవలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతడు జైలు పాలయ్యాడు.

# ఒక్క సినిమాతోనే సెన్సేషన్

సినీరంగుల ప్రపంచంలో ఫస్ట్ మూవీతోనే స్టార్ డమ్ సంపాదించుకున్న హీరోయిన్స్ చాలా మంది ఉన్నారు. కానీ ఆ తర్వాత అదే క్రేజ్ కంటిన్యూ చేయలేకపోయారు. దీంతో ఆడపాదడపా చిత్రాల్లో నటించి నెమ్మదిగా సినిమాలకు దూరమయ్యారు. ప్రస్తుతం ఓ హీరోయిన్ మాత్రం తెలుగులో ఆఫర్స్ కోసం వెయిట్ చేస్తుంది. చైల్డ్ ఆర్టిస్టుగా ఎంట్రీ ఇచ్చి.. ఆ తర్వాత కథానాయికగా రాణించింది. హీరోయిన్ గా తొలి చిత్రంతోనే కుర్రాళ్ల మది దోచేసింది. ఆమె మరెవరో కాదు.. హీరోయిన్ కృతి శెట్టి. డైరెక్టర్ బుచ్చిబాబు సన తెరకెక్కించిన ఉప్పెన సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఈ సినిమా తర్వాత ఆమె నటించిన ఒకటి రెండు చిత్రాలు తప్ప మిగతా అన్ని సినిమాలు డిజాస్టర్స్ అయ్యాయి. దీంతో ఆమెకు ఇండస్ట్రీలో ఆఫర్స్ తగ్గిపోయాయి.చివరగా తెలుగులో మనమే సినిమాలో కనిపించింది కృతి. కానీ ప్రస్తుతం తమిళంలో చేతినిండా సినిమాలతో బిజీగా ఉంది.



## ఒకే ఓవర్‌లో 7 సిక్స్‌లతో రుతురాజ్ గైక్వాడ్




బ్యాట్స్‌మన్ రుతురాజ్ గైక్వాడ్ 2022 నవంబర్ 28న క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచే ఫీట్ చేశాడు. క్రికెట్‌లో తొలిసారిగా, ఒక బ్యాట్స్‌మన్ ఒకే ఓవర్‌లో వరుసగా 7 సిక్సర్లు కొట్టాడు. దేశీయ క్రికెట్‌లో మహారాష్ట్ర తరపున ఆడుతున్న రుతురాజ్ గైక్వాడ్ విజయ్ హజారే ట్రోఫీ టోర్నమెంట్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఈ ప్రత్యేకమైన ప్రపంచ రికార్డును సృష్టించాడు. విజయ్ హజారే ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ 2022 నవంబర్ 28న మహారాష్ట్ర వర్సెస్ ఉత్తరప్రదేశ్ మధ్య జరిగింది.మహారాష్ట్ర తరపున ఆడిన, రుతురాజ్ గైక్వాడ్ ఒక ఓవర్‌లో వరుసగా 7 సిక్సర్లు కొట్టాడు. ఈ ఓవర్‌లో రుతురాజ్ గైక్వాడ్ వరుసగా 7 సిక్సర్లు కొట్టగలిగాడు. ఎందుకంటే, ఈ సమయంలో బౌలర్ కూడా నో బాల్ వేశాడు. ఈ సమయంలో, రుతురాజ్ గైక్వాడ్ ఉత్తరప్రదేశ్ ఎడమచేతి వాటం స్పిన్నర్ శివ సింగ్‌ను చీల్చాడు. శివ సింగ్ ఈ ఓవర్‌లో మొత్తం 7 బంతులు బౌలింగ్ చేశాడు. అందులో 1 నో బాల్ కూడా ఉంది. ఈ 7 బంతుల్లో రుతురాజ్ గైక్వాడ్ వరుసగా 7 సిక్సర్లు బాదాడు. శివ సింగ్ వేసిన ఈ ఓవర్‌లో రుతురాజ్ గైక్వాడ్ మొత్తం 43 పరుగులు చేశాడు. ఉత్తరప్రదేశ్‌తో జరిగిన ఈ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో రుతురాజ్ గైక్వాడ్ 159 బంతుల్లో 220 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ కాలంలో రుతురాజ్ గైక్వాడ్ బ్యాట్‌లో 10 ఫోర్లు, 16 సిక్సర్లు ఉన్నాయి. రుతురాజ్ గైక్వాడ్ భారతదేశం తరపున 6 వన్డేలు, 23 టి20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. రుతురాజ్ గైక్వాడ్ వన్డేల్లో 115 పరుగులు, టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 633 పరుగులు చేశాడు. రుతురాజ్ గైక్వాడ్ ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌కు కెప్టెన్‌గా ఉన్నాడు. రుతురాజ్ గైక్వాడ్ 71 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 2502 పరుగులు చేశాడు. ఇందులో 2 సెంచరీలు, 20 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

## పన్నా గనిలో గిరిజన కార్మికుడికి దొరికిన 40 లక్షల ఖరీదైన వజ్రం

సుమారు 40 లక్షలు ఖరీదైన వజ్రాన్ని ఓ గిరిజన కార్మికుడు గుర్తించాడు. మధ్యప్రదేశ్‌లోని పన్నా జిల్లాలో ఉన్న గనిలో ఆ డైమెండ్ అతనికి కనిపించింది. కృష్ణ కల్యాణ పట్టిలో ఉన్న ఓ గనిలో మాధవ్ అనే కార్మికుడు పనిచేస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం సుమారు 11.95 క్యారెట్ల ఖరీదైన రాయిని అతను గుర్తించినట్లు జిల్లా అధికారి తెలిపారు. ఆ డైమెండ్ చాలా క్లీన్‌గా ఉందని, ఖరీదైందని, దాని విలువ సుమారు 40 లక్షలు ఉంటుందని పన్నా డైమెండ్ ఆఫీసు అధికారి రవి పటేల్ తెలిపారు. అయితే రూల్స్ ప్రకారం పన్నా డైమండ్ ఆఫీసులో ఆ ఖరీదైన రాయిని కార్మికుడు డిపాజిట్ చేసినట్లు చెప్పారు. త్వరలో ఆ వజ్రాన్ని వేలం వేయనున్నారు. 12.5 శాతం రాయాల్టీ తీసి వేసిన తర్వాత కార్మికుడికి మిగితా డబ్బును ఇస్తారు. మధ్యప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ ప్రాంతంలో పన్నా జిల్లా ఉంది. ఇక్కడ 12 లక్షల క్యారెట్ల వజ్ర నిక్షేపాలు ఉన్నట్లు అనుమానిస్తున్నారు.

